తమిళనాడులో బీసీ రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం కోసం వెళ్లిన బీఆర్ఎస్ నేతలు

బీసీలకు బీఆర్ఎస్ బాసట గొప్ప విషయం

- పదేండ్లలోనే కేసీఆర్ తెలంగాణను తీర్చిదిద్దారు
- తమిళనాడు మాజీ సీఎస్ రామ్మోహన్‌రావు
- రిజర్వేషన్ల విధానంపై కేసీఆర్‌కు నివేదిక ఇస్తాం
- శాసనమండలిలో విపక్ష నేత మధుసూదనాచారి

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : బీసీలు న్యాయం కోసం ఎదురుచూస్తున్న సమయంలో వారికి బీఆర్ఎస్ బాసటగా నిలువడం గొప్ప విషయమని తమిళనాడు మాజీ చీఫ్ సెక్రటరీ రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం కోసం వెళ్లిన బీఆర్ఎస్ నేతలు శుక్రవారం చెన్నైలో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ అనేక ఘనవిజయాలు నమోదు చేసిందని ప్రశంసించారు. కేసీఆర్‌తో తనకున్న వ్యక్తిగత సంబంధాన్ని గుర్తుచేసుకున్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో మాదిరిగానే తెలంగాణలోనూ బీసీలు తమకు దక్కాల్సిన వాటా కోసం పోరాడుతున్నట్టు తెలిపారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో మొదలైన బీసీల హక్కుల పోరాటం సుదీర్ఘకాలం అనేక రూపాల్లో కొనసాగిందని, ప్రజల డిమాండ్లపై తమిళనాడు ప్రభుత్వాలు సామాజిక దృక్పథంతో వ్యవహరించాయని చెప్పారు. తమిళనాడు రాష్ట్ర విద్య, ఉద్యోగాల్లో 69 శాతం రిజర్వేషన్ల అమలు వెనుక సుదీర్ఘ చరిత్ర ఉన్నదని తెలిపారు. తమిళనాడు ప్రజల చైతన్యం, రాజకీయ పార్టీల విధానం, తమిళ ఉద్యమాలు, సాధించిన విజయాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ సాధనతో పాటు స్వల్పకాలంలో స్వరాష్ట్రాన్ని ప్రగతిశీల రాష్ట్రంగా తీర్చిదిద్దిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్.. బీసీల కోసం కూడా అద్భుత విజయాలు సాధించి తీరుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అనంతరం తమిళనాడు ప్రభుత్వ బీసీ, ఎంబీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి విజయ్‌రాజా కుమార్, కమిషనర్ వెంకటేశ్ తదితర ఉన్నతాధికారులతో బీఆర్ఎస్ నేతలు సమావేశమై పలు అంశాలపై అధ్యయనం చేశారు. కేసీఆర్ ఆదేశాల మేరకు తమిళనాడు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రతినిధి బృందం అధ్యయనంలో ఎంతో విలువైన సమాచారం లభించిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, శాసనమండలిలో విపక్షనేత సిరికొండ మధుసూదనాచారి తెలిపారు. రిజర్వేషన్ల విధానంపై చారిత్రక, సామాజిక, రాజకీయ పరిణామాల నివేదిక రూపొందించి కేసీఆర్‌కు అందజేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ రాజ్యసభ పక్ష ఉపనేత వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, జోగు రామన్న, శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర బీసీల హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ పక్షాన కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో తమిళనాడు రాష్ట్ర బీసీ సంఘాల ప్రతినిధులు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పుట్ట మధు, కోరుకంటి చందర్, భిక్షమయ్యగౌడ్, మాజీ చైర్మన్లు జూలూరు గౌరీశంకర్, ఆంజనేయగౌడ్, పల్లె రవికుమార్, తుల ఉమ, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాగేందర్‌గౌడ్, రవీంద్రసింగ్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు సుభప్రద పటేల్, కిశోర్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రీనివాస్, చెరుకు సుధాకర్, రాజ్యలక్ష్మి, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, విద్యార్థి సంఘం నేత దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మధుసూదనాచారి నేతృత్వంలోని బృందం ద్రవిడ కళగం పార్టీ కార్యాలయాన్ని సందర్శించింది. ఆ పార్టీ అధ్యక్షుడు వీరమణితో సమావేశమయ్యారు.

కాంగ్రెస్ అధిష్ఠానానికి 650 కోట్లు?

- సమకూర్చిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రముఖుడు!
- సంచలనంగా మారిన ఈడీ సోదాలు.
- కర్ణాటక తరహాలోనే ఇక్కడి నుంచి నిధులు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): త్వరలో ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలకు తెలంగాణ నుంచి భారీగా నిధులు వెళ్తున్నాయా..? హవాలా మార్గంలో కొన్ని రాష్ట్రాలకు హైదరాబాద్ నుంచి నిధులు తరలించారా? అంటే ఔననే అంటున్నాయి ఈడీ వర్గాలు. త్వరలో నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ నుంచి నిధులు తరలిస్తున్నారన్న ఆరోపణలు మరోసారి వినిపిస్తున్నాయి. ఇటీవలే కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ నుంచి నిధులు తరలించినట్టు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదే తరహాలో ఢిల్లీలోని అధిష్ఠానానికి రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ప్రముఖుడు ఒకరు రూ.650 కోట్ల నిధులను సమకూర్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఏ రూపంలో నిధులు మళ్లాయన్నదానిపై ఈడీ అధికారులు కూపీ లాగుతున్నారు. మహారాష్ట్ర మీదుగా ఢిల్లీకి నిధులు వెళ్లినట్టు ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలోని ఓ కీలక నేత కేంద్రంగానే ఇది సాగినట్టు అనుమానాలు బలపడుతున్నాయి. నెలన్నర నుంచి నిధుల తరలింపు జరుగుతున్నది. దీంట్లో కొందరు బడా హవాలా వ్యాపారులు కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తున్నది. కొన్ని నిధులు హర్యానాకు కూడా చేర్చినట్టు చెప్తున్నారు. దీనిని ఢిల్లీలోని అధిష్ఠానం పెద్ద ఒకరు నేరుగా పర్యవేక్షించినట్టు చెప్తున్నారు. రాష్ట్రంలోని అనేక మంది అనుమానితులపై ఈడీ అధికారులు నిఘా పెట్టారు. వారి లావాదేవీలను తనిఖీ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇంత పెద్ద మొత్తం ఒకేసారి హవాలా రూపంలో చేతులు మారలేదని రాష్ట్రంలోని ఓ అధికారి వ్యాఖ్యానించారు. నెలన్నర క్రితమే ఈ తంతంగం పూర్తయిందని చెప్తున్నారు. అయితే, ఒక కేసు విచారణపై మహారాష్ట్రకు చెందిన ఒక వ్యక్తిని విచారించగా ఢిల్లీ, తెలంగాణ లింకు బయటకు వచ్చిందని చెప్తున్నారు.

ఆ డబ్బు ఎక్కడిది?

రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ప్రముఖుడు అధిష్ఠానానికి ఎక్కడి నుంచి నిధులు సమకూర్చారన్నది ఆసక్తికరంగా మారింది. ఇటీవల రాష్ట్రంలో పలు పనులను, కాంట్రాక్టులను ఫైనల్ చేసిన విషయం తెల్సిందే. వీటిపై బహిరంగంగానే అవినీతి ఆరోపణలున్నాయి. వీటితోపాటు ప్రపంచ బ్యాంకు పేరుతో కొన్ని పనులు చేపట్టనున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ పనులకు సంబంధించి పలువురు 'విరాళాలు' ఇచ్చినట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇక హైడ్రా పేరుతో జరుగుతున్న కూల్చివేతల వెనుక కూడా వసూళ్లు జరుగుతున్నాయని పెద్ద ఎత్తున ఆరోపణలున్నాయి. వీటి నుంచే సమకూర్చి ఉంటారని చెప్తున్నారు. అధికార పార్టీలోని ఒక వర్గం పార్టీకి సంబంధించిన నిధుల వేట కొనసాగిస్తున్నది. దీనిపై పార్టీలో కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకోవడానికి ఒక వర్గమే నిధుల సమీకరణ చేస్తున్నదని, దీంతో పనుల్లో, పదవుల్లో వాళ్లకే ప్రాధాన్యం లభిస్తున్నదని కూడా చెప్తున్నారు. తాజాగా జరిగిన ఈడీ దాడులకు కూడా కాంగ్రెస్ పార్టీలోని వర్గపోరే కారణమని చెప్తున్నారు. విషయం తెల్సిన పెద్ద మనుషుల పాత్ర కూడా దీని వెనుక లేకపోలేదని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

శ్రీ చైతన్య కళాశాలకు 2 లక్షల జరిమానా విధించి, రసీదును అందజేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

శ్రీ చైతన్య కాలేజీలో ఫుడ్ పాయిజన్?

- 60 మంది విద్యార్థులకు అస్వస్థత
- కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన
- వైరల్ ఫీవరే అంటున్న ఏజీఎం
- అధికారుల తనిఖీ.. రూ.2 లక్షల ఫైన్

మాదాపూర్, సెప్టెంబర్ 27: హైదరాబాద్ మాదాపూర్‌లోని శ్రీ చైతన్య అక్షర భవన్ క్యాంపస్‌లో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సమాచారం తెలిసిన విద్యార్థి సంఘాల నేతలు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఏబీవీపీ, ఎన్ఎస్‌యూఐ, నవ తెలంగాణ విద్యార్థి శక్తి సంఘం ఆధ్వర్యంలో కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, వారిని కళాశాలలోనే నిర్బంధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత రెండురోజులుగా ఫుడ్ పాయిజన్ తోపాటు వైరల్ ఫీవర్‌తో సుమారు 60 మందికి పైగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీజేవైఎం రంగారెడ్డి జిల్లా కన్వీనర్ నిఖిల్ చారి తెలిపారు. ఆందోళన సందర్భంగా కళాశాల గేటు అద్దాలు పగిలాయి. దీంతో పోలీసులు ఏబీవీపీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కాలేదని, ఎవరో తప్పుగా సమాచారం ఇచ్చారని, కొందరికి వైరల్ ఫీవర్ వచ్చిందని కళాశాల ఏజీఎం శివ ప్రసాద్ తెలిపారు. మాదాపూర్‌లోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ కళాశాలను శుక్రవారం చందానగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి, ఏఎంహెచ్‌వో రవి, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. హాస్టల్‌లో అపరిశుభ్రత ఉండటంతో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీ చైతన్య కళాశాలకు రూ.2 లక్షల జరిమానా విధించారు.

నూతనంగా ఏర్పడిన దామగుండం అడవి పరిరక్షణ జేఏసీ కమిటీ కార్యవర్గం

దామగుండం పరిరక్షణ జేఏసీ చైర్మన్‌గా వెంకటయ్య

పూడూరు, సెప్టెంబర్ 27: నేవీ రాడార్ సిగ్నల్ కేంద్రం ఏర్పాటును అడ్డుకొనేందుకు, దామగుండం అడవి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పరిరక్షణ జేఏసీ చైర్మన్ దేవనోనిగూడెం వెంకటయ్య పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం రామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం అడవి పరిరక్షణ జేఏసీ చైర్మన్‌గా వెంకటయ్యను ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా విజయ్ ఆర్య క్షత్రియ, మాజీ ఎంపీపీ మల్లేశం, సునంద బుగ్గన్న, విజయలక్ష్మి పండిట్, కోఆర్డినేటర్లుగా 19 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే నేవీ రాడార్ సిగ్నల్ కేంద్రం ఏర్పాటును విరమించుకోవాలని, లేని పక్షంలో అన్నిపార్టీలు, సంఘాలను ఏకంచేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

స్కూళ్ల సమీపంలో జంక్‌ఫుడ్‌పై నిషేధం

- ఆల్కహాల్, డ్రగ్స్, పొగాకు అమ్మకాలపైనా..
- మత్తు పదార్థాల నియంత్రణకు ప్రహరీక్లబ్బులు

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : పాఠశాలల సమీపంలో జంక్‌ఫుడ్, మత్తుపదార్థాల విక్రయాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. 100 మీటర్ల పరిధిలో ఎలాంటి జంక్‌ఫుడ్స్ విక్రయాలు జరుపొద్దని, డ్రగ్స్, ఆల్కహాల్, పొగాకు అమ్మకాలపై నిషేధం అమల్లో ఉంటుందని స్పష్టంచేసింది. విద్యాలయాల్లో డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రహరీక్లబ్‌లు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఈ ఏడాది జూలై 13న జీవో విడుదల చేసింది. తల్లిదండ్రులు, పోలీసులు, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులతో కలిసి ఈ క్లబ్‌ను ఏర్పాటుచేస్తారు. పాఠశాల హెచ్ఎం క్లబ్‌కు అధ్యక్షుడిగా, సీనియర్ టీచర్ ఉపాధ్యక్షుడిగా, 6 నుంచి 10వ తరగతి వరకు క్లాసుకు ఇద్దరు చొప్పున, పీటీఏ(పేరెంట్ టీచర్ అసోసియేషన్)నుంచి ఒక ప్రతినిధి, స్థానిక పోలీసుస్టేషన్ నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో పోలీసుశాఖ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సహకారం తీసుకుంటారు. క్లబ్బుల పనితీరు, నిర్వహణపై విద్యాశాఖ సమగ్రమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. క్లబ్‌లను ఏర్పాటుచేస్తూ జీవో ఇచ్చిన రెండు నెలల తర్వాత మార్గదర్శకాలివ్వడం గమనార్హం.

కేఆర్ సురేశ్‌రెడ్డి | దీవకొండ దామోదర్‌రావు | వద్దిరాజు రవిచంద్ర | పార్థసారథిరెడ్డి

పార్లమెంట్ కమిటీల్లో బీఆర్ఎస్

- ప్రజాఫిర్యాదులు, న్యాయ కమిటీలో కేఆర్ సురేశ్‌రెడ్డి
- అటవీ పర్యావరణ కమిటీలో దీవకొండ
- పెట్రోలియం కమిటీలో వద్దిరాజు
- హెల్త్ కమిటీలో పార్థసారథిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): 2024-25వ సంవత్సరానికి పార్లమెంట్ స్థాయీ సంఘ సభ్యులుగా బీఆర్ఎస్ పార్లమెంటరీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఉపనేత వద్దిరాజు రవిచంద్ర, ఎంపీలు దీవకొండ దామోదర్‌రావు, పార్థసారథి రెడ్డి నియమితులయ్యారు. పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్ స్టాండింగ్ కమిటీలో కేఆర్ఎస్ , సైన్స్‌అండ్ టెక్నాలజీ, అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల కమిటీలో దీవకొండ , పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ కమిటీలో రవిచంద్ర, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో పార్థసారథి రెడ్డిలకు అవకాశం లభించింది.

రాత్రికి రాత్రి లక్ష ఇండ్లు ఎక్కడివి చిట్టీ

- డబుల్ బెడ్‌రూం ఇండ్లపై సర్కారు తీరుపై కేటీఆర్ ఎద్దేవా

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): 'కట్ట లేదన్నారు. ప్రజలను మభ్యపెట్టాం అన్నారు. మరి లక్ష ఇండ్లు రాత్రికి రాత్రికి ఎక్కడ నుంచి పుట్టుకొచ్చాయి చిట్టీ...' అని డబుల్ బెడ్‌రూం ఇండ్లపై సర్కారు అనుసరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రం విసిరారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల ఫొటోలను, పత్రికల్లో వచ్చిన ప్రత్యేక కథనాలను ట్యాగ్ చేస్తూ ఆయన ఎక్స్‌వేదికగా పోస్ట్‌చేశారు. 'మేము నిర్మిస్తే.. మీరు కూల్చేస్తున్నారు. మాది నిర్మాణం.. మీది విధ్వంసం. లక్షల నిర్మాణాలు మావి.. లక్షల కూల్చివేతలు మీవి. మూసీనది సాక్షిగా మహానగరంలో కేసీఆర్ లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు. కాంగ్రెస్ విష ప్రచారాలు అబద్ధాలు అనడానికి మరో సాక్ష్యం' అని పేర్కొన్నారు. కేసీఆర్ పాలన దృశ్యాలను చూసి మింగుడు పడటం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ జూటా మాటలు, కుట్రలకు, పనుల డ్యామేజ్ కంట్రోల్‌కు కేసీఆర్ నిర్మాణాలే దిక్కయ్యాయని ఆయన విమర్శించారు. కేసీఆర్ లక్ష డబుల్ నిర్మాణాలు నిజం... కేటాయింపులు నిజమని ఆయన స్పష్టం చేశారు.

ప్రజా పోరాట యోధుడు బాపూజీ : కేటీఆర్

ప్రజాపోరాటయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కేటీఆర్ పేర్కొన్నారు. 1969లో ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమంలో తన మంత్రి పదవికి రాజీనామా చేసి ఎందరో తెలంగాణ ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచిన మహానేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటం, మలి దశ తెలంగాణ ఉద్యమం దాకా ప్రజా ఉద్యమాల్లో వారి పాత్ర అనిర్వచనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ సారథ్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసంలోనే పురుడు పోసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ట్యాంక్ బండ్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేసి, హార్టికల్చరల్ యూనివర్సిటీకి వారి పేరు పెట్టి ఘనంగా స్మరించుకున్నదని తెలిపారు.

ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి

- దసరాలోగా 2 లక్షల రుణమాఫీ చేయకపోతే సచివాలయం ముట్టడిస్తాం.. అసెంబ్లీనీ స్తంభింపజేస్తాం
- కాంగ్రెస్ సర్కార్ రైతులకిచ్చిన ఒక్క హామీ నెరవేర్చలె
- మాకు ఎమ్మెల్యే పదవి కంటే రైతులే ముఖ్యం
- నీ గుండెల్లో నిద్రపోతున్నా రేవంత్..!
- కాళేశ్వరం కూలిపోయిందా..? మల్లన్నసాగర్‌కు వచ్చి చూడు
- రేవంత్‌కు కూల్చుడు తప్ప కట్టుడు తెల్వదు
- నంగునూరులో రుణమాఫీ ధర్నాలో హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లా నంగనూరులో రైతుల ధర్నాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, అన్ని వర్గాలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దసరా పండుగలోగా రైతులందరికీ రుణమాఫీ చేయకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తామని, వచ్చే అసెంబ్లీ సమావేశాలను స్తంభింపచేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేదాకా బీఆర్ఎస్ వదిలిపెట్టదని స్పష్టంచేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలంటూ శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో రైతులు నిర్వహించిన ధర్నాలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ, రైతుభరోసా, పంటలకు బోనస్ ధర ఇలా అన్ని విషయాల్లో రైతులను రేవంత్‌రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో.. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ, అవ్వ తాతలకు నాలుగు వేల పెన్షన్, అక్కచెల్లెళ్లకు రూ.2,500 సహా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తే రాజీనామా చేస్తానంటూ తాను సవాల్ చేసిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఎమ్మెల్యే పదవి కంటే రైతులకు రుణమాఫీ కావడమే తనకు ముఖ్యమని చెప్పారు. 'పంద్రాగస్టు వరకు 2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. మొదట రూ.49 వేల కోట్లు అని, ఆ తర్వాత 31 వేల కోట్లు అని చెప్పి చివరకు మాఫీ చేసింది రూ.17 వేల కోట్లు. ఒక్క నంగునూరు మండలంలోనే 11,000 మంది రైతులు అప్పు తెచ్చుకుంటే ఐదువేల మందికే రుణమాఫీ అయింది. మరి.. ఎక్కడ రుణమాఫీ చేసిండ్రు' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమైంది? రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు.

> 'హరీశ్‌రావు ఏడ నిద్రపోతున్నడు.. రాజీనామా ఎప్పుడు చేస్తావ్.. అని రేవంత్‌రెడ్డి అడుగుతున్నడు. నీ గుండెల్లో నిద్రపోతున్న రేవంత్‌రెడ్డీ.. రైతులకు రుణమాఫీ జరిగేదాకా నిన్ను విడిచిపెట్టను' -హరీశ్‌రావు

కాళేశ్వరం కూలిపోతే నీళ్లు ఎట్లా వచ్చాయో చూడు

కాళేశ్వరం కూలిపోయిందని చెప్తున్న రేవంత్‌రెడ్డి వచ్చి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌ను చూడాలని, కాళేశ్వరం కూలిపోతే నీళ్లు ఎట్లా వచ్చాయో చెప్పాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి కూలగొట్టుడు తప్ప కట్టుడు తెలవదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరంలో 100 భాగాలు ఉన్నాయని, అందులో మూడు బరాజ్‌లు, 19 పంప్‌హౌజ్‌లు, 18 రిజర్వాయర్లు, సొరంగాలు, కాలువలు, పైపులైన్లు ఉన్నాయని వివరించారు. రెండు పిల్లర్లకి చిన్నపగుళ్లు వస్తే కాళేశ్వరం మొత్తం కూలిపోయిన్నట్టు అబద్ధాలు ప్రచారం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఫారూఖ్‌హుస్సేన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌కు గోడు వెల్లబోసుకున్న రైతులు

నంగునూరు ధర్నాకు తరలివచ్చిన రైతులతో హరీశ్‌రావు కొద్దిసేపు ముచ్చటించారు. రుణం ఎంత ఉన్నది? ఎన్ని ఎకరాల భూమి ఉన్నది? రుణమాఫీ కాకపోవడానికి అధికారులు ఏం చెప్తున్నారు? వంటి విషయాలను రైతులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాము రుణమాఫీ కోసం ఎవరెవరి వద్దకు ఎలా తిరిగామో రైతులు హరీశ్‌కు వివరించారు. 'మేమంతా రుణమాఫీ కానోళ్లం సార్.. పంట కోతకు వచ్చింది కానీ రైతుబంధు పడలేదు. కేసీఈర్ సార్ ఉన్నప్పుడు రైతుబంధు మంచిగా ఇచ్చిండు. రేవంత్ మాటలకు మోసపోయాం. రుణమాఫీ అయ్యేంత వరకు కొట్లాడుదాం. దసరా పండుగ వరకు మాఫీ చేయకపోతే సచివాలయానికి వస్తాం సార్.. మాఫీ అయ్యేంత వరకు అక్కడే ఉంటాం' అని రైతులు చెప్పారు.

మిత్తికి తెచ్చి మీది పైసలు కట్టిన

నాకు బ్యాంకుల రెండు లక్షల ముప్పై వేల రుణం ఉన్నది. రెండు రూపాయల చొప్పున అప్పు తెచ్చి మీది రూ.40 వేలు బ్యాంకుల కట్టిన. మిత్తికి తెచ్చి రెండు నెలలు అయింది. లోన్ మాఫీ అయితలేదు. ఏం చేయాల్నో అర్థమైతలేదు. నాకు మూడున్నర ఎకరాల భూమి ఉన్నది. ఇంకా రైతుబంధు రాలె. కాంగ్రెస్‌ది ఏమి సర్కారో ఏమో.

- జక్కుల యాదగిరి, రైతు, గట్లమల్యాల, సిద్దిపేట జిల్లా

రైతుబంధు లేదు.. రుణమాఫీ లేదు

నాకు ఒక ఎకరం ఒక గుంట భూమి, రూ.58 వేల క్రాప్ లోన్ ఉన్నది. బ్యాంకుకు వెళ్తే వ్యవసాయ అధికారులను అడుగుమన్నరు. వచ్చే నెలలో లోన్ రెన్యువల్ ఉన్నది. కట్టకపోతే అపరాధ వడ్డీ ఎస్తమంటుర్రు. కేసీఈర్ ఉన్నప్పుడు రైతుబంధు కంఫర్‌గా రూ.5 వేలపైన పడుతుండే. ఇప్పుడు రైతుబంధు రాక పెట్టుబడికి మిత్తికి రూ.10 వేల అప్పు తెచ్చిన.

-దుర్గారెడ్డి, రైతు, నంగునూరు, సిద్దిపేట జిల్లా

సీఎంకు కాళేశ్వరంపై అవగాహనలేదు

- కేసీఆర్ మీద కోపంతో ప్రాజెక్ట్‌ను అర్థం చేసుకోరా?: వినోద్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహన లేదని మాజీ ఎంపీ బోయిన పల్లి వినోద్‌కుమార్ ఎద్దేవాచేశారు. రూ.లక్షల కోట్లతో కాళేశ్వరం కట్టడం, కూల్చ డం మన కండ్ల ముందే అంటూ సీఎం వ్యా ఖ్యానించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కేసీఆర్ మీద కోపంతో కాళేశ్వరాన్ని కనీసం అర్థం చేసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో మూడు పిల్లర్లు కుంగితే, మొత్తం ప్రాజెక్టే పనికిరాదనే రీతిలో మాట్లాడటం సీఎం అవగాహన రాహిత్యానికి పరాకాష్టగా అభివర్ణించారు. కాళేశ్వరం అంటే మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం మాత్రమే కాద ని చెప్పారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం 14 టీఎంసీలతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి డిజైన్ చేస్తే, దాని సామర్థ్యాన్ని కాళేశ్వరం ద్వారా కేసీఆర్ 141 టీఎంసీలకు పెంచారని వివరించారు.

రెడ్డి జన సంఘం

4-1-366, ABIDS, HYDERABAD.

స్కాలర్‌షిప్పులకై దరఖాస్తులు

రెడ్డి జన సంఘం నుండి **2024-2025** సం॥ కొరకు స్కాలర్‌షిప్పులు పొందుటకు కాలేజీలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థుల **(Merit cum Means)** నుండి దరఖాస్తులు **01-10-2024 నుండి 31-10-2024** వరకు కోరబడుచున్నవి. దరఖాస్తుఫారం: **www.reddyjanasangham.com** Website నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

ఫోన్ : **040-24752986**, వాట్సాప్ : **7981956543.**